సాక్షి విశాఖపట్నం

మంగళవారం। 17। సెప్టెంబర్। 2024



స్వచ్ఛత హీ సేవ ప్రారంభం

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం మెరుగుప డుతుందని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ ఎం.అంగముత్తు పేర్కొన్నారు. 8లో



మండపానికి శంకుస్థాపన

సింహగిరిపై దాత సహకారంతో నిర్మించ నున్న సహస్రదీపాలంకరణ మండపం పనులకు శంకుస్థాపన చేశారు. 8లో



సా.. గుతున్న ప్రాజెక్టులు

వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులు నత్తనడకన సాగుతు న్నాయి. కొన్నింటికి డీపీఆర్, టెండర్ల ప్రక్రియ పూర్తయిన అతీగతీ లేకుండా ఉన్నాయి. 8లో

న్యూస్‌రీల్

19న గవర్నర్ విశాఖ రాక



మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 19న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో గురువారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా నొవోటెల్ హోటల్‌కు వెళ్లి అక్కడ బస చేస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ఏయూ మెరైన్ విభాగంలో జరిగే దివ్య కళా మేళాలో పాల్గొంటారు. అనంతరం నొవోటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 20న సాయంత్రం 6.55 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

నేడే అనంతుని జయంతి



అనంతుని ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో మంగళవారం జరగనున్న అనంతుని జయంతికి భక్త బృందం సభ్యులు, ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి, అనంతుని ఉత్సవ విగ్రహాలకు నూతన వస్త్రాలను సమకూర్చారు. ఆలయ బోగం, ముఖ ద్వారం, బేడా మండపాన్ని మామిడి, అరటి తోరణాలతో సుందరంగా అలంకరించారు. గతంలో బేడా మండపంలో అనంతుని వ్రతాలు నిర్వహించేవారు. ఈసారి కల్యాణ వేదిక వద్ద వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు వ్రతాలు నిర్వహించుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేశారు. వ్రతాలు ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతాయి.

నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మహారాణిపేట: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 19 ఏళ్ల లోపు గల 5,20,891 మందికి బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా సరఫరా చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి వారం రోజులపాటు వీటిని పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్రను, రెండేళ్ల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. 3 నుంచి 19 ఏళ్ల విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తర్వాత మాత్రను చప్పరించాలన్నారు. అన్ని పాఠశాలలు, కాలేజీలకు మాత్రలు సరఫరా చేశామని తెలిపారు. మాత్ర చప్పరించడం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు కలగవని స్పష్టం చేశారు. ఈ వారం రోజుల్లో మాత్ర తీసుకోని వారు ఈనెల 25న మాప్ అప్ రౌండ్ కార్యక్రమంలో తప్పకుండా తీసుకోవాలన్నారు.

నేవల్ అధికారులకు ముగిసిన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న నేవల్ అధికారులు

తగరపువలస: గంభీరం ఐఐఎంవీలో ఆరు రోజుల పాటు ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్ అధికారులకు జరిగిన శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ పీజే నెవేర్ పాల్గొన్నారు. భారత నౌకాదళానికి ఎన్ఏడీ పాత్ర, సహకారం గురించి శిక్షణలో వివరించారు. ట్రైనీ అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించవలసిన విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.రంగాచార్యులు, కో డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మహారాణిపేట : ప్రకృతి వ్యవసాయంపై సోమవారం నగరంలోని ఓ హోటల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మేఘాలయ రాష్ట్రం నుంచి అనేక మంది వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సాధికార సంస్థ, ఎంఎస్ మాక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక సహాయం, ప్రకృతి వ్యవసాయం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. వ్యవసాయ శాఖ రీజినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వి.కృష్ణారావు, ఎం.ఎస్.మాక్స్ సీఈవో పి.గంగరాజు, ఎం.కామరాజు, తరుణ్ ఆదిత్య, హేమలత, టి.లక్ష్మణరావు, రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.



కుటుంబమంతా నిరాశ చెందాం

మా మనవరాలు ఎంతో కష్టపడి నీట్ పరీక్ష రాసింది. సీటు వస్తుందని ఎంతో ఆశ పడింది. చివరి నిమిషంలో సీటు రాకపోవడంతో మా కుటుంబం ఎంతో నిరాశ చెందింది. ప్రస్తుత పాలకుల పరిస్థితి చూస్తే మళ్లీ ఎంబీబీఎస్ సీటు వస్తుందా? అన్న అనుమానం కూడా ఉంది. మా మనవరాలు రాత్రింబవళ్లు ఎంతో కష్టపడి చదివింది. ఈ ఏడాది కొత్త ప్రభుత్వ **కళాశాలల్లో** సీట్లు రాకపోవడం వల్ల ఈ పరిస్థితి ఎదురైంది. పాలకులు చొ**రవ తీసుకొని** కొత్త కళాశాలల్లో సీట్లు వచ్చేలా చూడాలి.

–కాకి కనకమహాలక్ష్మి, **అల్లిపురం**





వైద్య విద్య అందనంత దూరం

కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కూటమి ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలి. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన విద్యార్థులకు తీరని అన్యాయం చేసే నిర్ణయమిది. రాష్ట్రంలో నిర్మాణదశలో ఉన్న అన్ని మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలి. **ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూరాలని చూస్తే ప్రభుత్వం సంక్షేమ పాలన నుంచి తప్పుకున్నట్టు భావించాల్సి వస్తుంది. విద్యను వ్యాపారం చేయడం వల్ల అన్ని వర్గాల ప్రజలు అప్పుల పాలవుతారు.**

–బొట్టా చిన్నయాదవ్, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, అనకాపల్లి

భూదాన్ భూములపై కన్ను!

గెడ్డను పూడ్చి, కంపచెట్లు కొట్టి మూడు ఎకరాల చదును




తుప్పలు కొట్టేసి ఒక్క దగ్గర వేసిన దృశ్యం

- మొత్తం 50.56 ఎకరాల భూములపై ముఖ్యనేత గురి
- రంగంలోకి ముఖ్యనేత అనుచరులు
- ఈ భూములను తాము డీల్ చేస్తున్నామని సంకేతాలు
- పట్టాలున్న వారితో బేరసారాలు
- రూ.500 కోట్ల విలువైన భూములపై మంత్రాంగం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

భూ బకాసరులు మళ్లీ చెలరేగిపోతున్నారు. కోట్ల విలువైన భూముల వివరాలను సేకరిస్తూ కబ్జా చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏకంగా రూ.500 కోట్ల విలువచేసే భూదాన్ భూములపై ఇప్పుడు కూటమి నేతల కన్ను పడింది. పరదేశిపాలెంలోని సర్వే నంబరు 132లోని మొత్తం 50.56 ఎకరాల భూదాన్ భూములను తమపరం చేసుకునేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఈ సర్వే నంబరులో తమకు భూములు ఉన్నాయంటూ పట్టాలు పట్టుకుని తిరుగుతున్న వారితో మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ భూముల వ్యవహారాలను తాము చూసుకుంటామని.. మొత్తం పని అయిపోయిన తర్వాత ఎంతో కొంత మొత్తం ముట్టచెబుతామని దారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. భూదాన్ భూముల్లో తమకు పట్టా ఉందంటూ ఎక్స్–సర్వీస్‌మెన్ పేరుతో 3 ఎకరాల స్థలాన్ని చదును చేసే కార్యక్రమాన్ని అధికార పార్టీ నేతలు కొందరు చేశారు. ఇక్కడ ఉన్న చిన్నపాటి గెడ్డను పూడ్చివేయడంతో పాటు ఉన్న కంపచెట్లను మొత్తం తొలగించారు. ఈ భూమి విలువ రూ.30 కోట్లు ఉంటుందని అంచనా. ఇక్కడితో ప్రారంభించి.. మొత్తం 50.56 ఎకరాల భూమిని తమ పరం చేసుకునేందుకు ముఖ్యనేత అనుచరులు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఇది భూదాన్ భూమి అని.. ఇక్కడ ఎవరికీ పట్టాలు లేవని గతంలో జిల్లా కలెక్టర్లు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అయినప్పటికీ ఇతర మార్గాల ద్వారా ఈ భూమిని కాజేసేందుకు ముఖ్యనేత కాస్తా ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది.



పరదేశిపాలెం పరిధిలో భూదాన్ భూములు (ఇన్‌సెట్లో) అడంగల్‌లో భూదాన్ భూమి అని స్పష్టం

రూ.500 కోట్ల భూమి!

వాస్తవానికి పరదేశిపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 132లో మొత్తం 50.56 ఎకరాల భూమి ఉంది. ఇది ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో స్పష్టంగా ఉంది. పట్టాదారు పేరు కింద భూదాన్ లాండ్స్ అని కూడా అడంగల్‌లో పేర్కొన్నారు. ఈ భూములపై సర్వాధికారాలు భూదాన్ బోర్డుకు ఉంటాయి. అయితే, ఉమ్మడి రాష్ట్రంలో కీలకంగా ఉన్న భూదాన్ బోర్డు... ఇప్పుడు కాస్తా హైదరాబాద్ కేంద్రంగానే ఉండటంతో కీలకంగా వ్యవహరించలేకపోతోంది. ఈ నేపథ్యంలోనే పరదేశిపాలెంలోని 50.56 ఎకరాల భూమి తమదేనంటూ కొద్ది మంది పట్టాలను చూపిస్తున్నారు. ఇప్పుడు ఈ పట్టాలు కలిగిన యజమానులతో ముఖ్యనేత మంతనాలు జరుపుతున్నారు. అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగినా మీకు పనికాదని.. అంతా తాను పనిచేసుకుంటానని చెప్పినట్టు తెలుస్తోంది. ఇక్కడ ఎకరా రూ.10 కోట్ల మేర విలువ ఉంది. అంటే మొత్తం 50.56 ఎకరాల విలువ రూ.500 కోట్లపైమాటే. కోట్ల విలువైన భూమిని తన పరం చేసుకునేందుకు అధికార పార్టీ నేత గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పట్టాలున్నాయంటూ..!

వాస్తవానికి ఈ భూముల్లో తమకు పట్టాలున్నాయంటూ పలువురు కోర్టులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు ఉన్న పట్టాలను ఆధారాలుగా చూపుతూ.. కొందరైతే ఏకంగా భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) దృష్టికి కూడా తీసుకెళ్లి.. తమ సంగతి తేల్చాలంటూ విన్నవించుకున్నారు. అన్ని పరిశీలించిన కలెక్టర్లు ఈ భూములన్నీ భూదాన్ బోర్డువేనని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ భూములను ఇల్లు లేని పేదలకు ఇచ్చేందుకు ఉపయోగించుకోవచ్చని కూడా ఆదేశాలు ఇచ్చారు. భూదాన్ బోర్డుకు ఇవ్వకముందే తమకు భూములు ఇస్తూ పట్టాలు ఇచ్చారని పలువురు భూయజమానులు ఇప్పటికీ ఇంకా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యనేత రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. ఈ భూముల వ్యవహారాన్ని తమకు వదిలేయాలని.. తాము డీల్ చేసుకుంటామని చెప్పినట్టు తెలుస్తోంది. మొత్తం వ్యవహారం ముగిసిన తర్వాత మీకు ఎంతో కొంత ముట్టచెబుతామని స్పష్టం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇందుకు అనుగుణంగా పట్టాలు ఉన్న వారిని ముఖ్యనేత అనుచరులు కలిసి తమకు అప్పగించాలని ఆదేశించినట్టు కూడా తెలుస్తోంది.

ఎక్స్–సర్వీస్‌మెన్ పేరుతో..

మొత్తం భూదాన్ భూములపై కన్నేసిన అధికార పార్టీ నేతలు తాజాగా మూడు ఎకరాల స్థలాన్ని చదును చేసే ప్రయత్నం చేశారు. మధురవాడ నుంచి ఆనందపురం వెళ్లే ప్రధాన రహదారిలో బోరవానిపాలెం సర్వీసు రోడ్డులో... ఓజోన్ వ్యాలీ భూములకు సమీపంలో ఉన్న ఈ భూములపై కన్నేసిన నేతలు చదును చేసే ప్రక్రియను ప్రారంభించారు. మొదటి విడతలో ఎక్స్–సర్వీస్‌మెన్ పేరుతో 3 ఎకరాల పట్టా ఉందంటూ చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ భూమిలో ఉండే చిన్న గెడ్డను కూడా పూడ్చే ప్రయత్నం చేశారు.

ఈ మూడు ఎకరాల స్థలంలో ఉన్న తుప్పలను కూడా కొట్టేసి.. ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ ఎకరా విలువ రూ.10 కోట్ల మేర ఉంటుంది. అంటే మొదటి విడతలో రూ.30 కోట్ల విలువైన భూమితో ప్రారంభించి.. మొత్తం 50 ఎకరాలకు ఎసరు పెట్టే ప్రణాళికలు పక్కాగా సిద్ధమయ్యాయని తెలుస్తోంది. వాస్తవానికి ఈ భూములకు ముందు 100 అడుగుల రోడ్డు ఉంది. ఇక్కడి నుంచి నేరుగా హైవేకి దారి ఉంది. అంతేకాకుండా పక్కనే వుడా లే–అవుట్ కూడా గతంలో వేసి విక్రయాలు జరిపారు.

వైభవంగా మిలాద్ ఉన్ నబీ



మిలాద్ -ఉన్ నబీ సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

అల్లిపురం/డాబాగార్డెన్స్ : మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని స్మరించుకుంటూ సోమవారం నగరంలో ముస్లింలు మిలాద్–ఉన్–నబీ వైభవంగా నిర్వహించారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మూడో నెల రబీ అల్–అవ్వల్ 12వ రోజున జరుపుకుంటారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రార్థనలు చేపట్టారు. అనంతరం సుందరంగా అలంకరించిన వాహనాల్లో చిన్నారులు జెండాలు చేత పట్టుకుని అందరినీ ఉత్సాహపరిచారు. చిన్నాపెద్ద తేడా లేకుండా ఖురాన్ పఠించారు. దయ, కరుణ కలిగి ఉండాలని ప్రవక్త సూత్రాలు వెల్లడించారు. సూఫీ సంప్రదాయాలతో అల్లిపురంలోని యాతపేట మసీదు నుంచి తిరువీధి ఉత్సవం ప్రారంభించారు. కెప్టెన్ రామారావు జంక్షన్, లీలామహల్ రోడ్డు, సరస్వతీ పార్కు, డాబాగార్డెన్స్, మహిళా కళాశాల, జగదాంబ మీదుగా పాతనగరానికి చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు.





ర్యాలీలో వివిధ రకాల మసీదుల ఆకృతులు

అనంతరం సీరత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివిధ మసీదులకు చెందిన ముస్లింలు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్ప్రింగ్ రోడ్డులోని రిజర్వ్‌లైన్ మసీదు వద్ద ప్రారంభమైన శాంతి ర్యాలీ డాల్ఫిన్ జంక్షన్, మహిళా కళాశాల, సెవెన్‌హిల్స్, జగదాంబ జంక్షన్, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ మీదుగా పాతనగరంలో గల హజ్రత్ ఇషాక్ మదిని ఔలియా రహితుల్లాలై దర్గా వరకు సాగింది. ర్యాలీలో ఇస్లామిక్ జెండాలు చేతబట్టిన చిన్నారులు, తెల్లటి గుర్రాలు, ఒంటెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నగరాన్ని వదలం

'ఏజెన్సీలో చాలా ఏళ్ల నుంచి పనిచేస్తున్నాం.. మాకు కూడా మైదాన ప్రాంతాల్లో పనిచేయాలని ఉంటుంది..ప్రభుత్వ జీవో ప్రకారం బదిలీలు జరుగుతాయని ఎదురుచూస్తున్నాం.. కానీ ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు లేఖలకు ప్రాధాన్యం ఇస్తారని ఊహించలేదు. మా వినతులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ జీవో ప్రకారం నిష్పక్షపాతంగా బదిలీలు జరపాలి' అని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు కోరుతున్నారు. సిఫార్సు లేఖలు పెద్ద సంఖ్యలో రావడంతో ఇప్పుడు తమ పరిస్థితి అయోమయంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. –మహారాణిపేట

- ఏజెన్సీకి వెళ్లలేం
- ప్రజాప్రతినిధుల సిఫార్సుల కోసం తహసీల్దార్లు, ఎంపీడీవోల పైరవీలు
- బదిలీల్లో అధికారపార్టీ సిఫార్సులకే ప్రాధాన్యం
- ఏళ్ల నుంచి మన్యంలో పనిచేస్తున్న వారికి అన్యాయం
- నిబంధనలకు అనుగుణంగా బదిలీలు చేయాలని వినతి



మన్యమంటే ముఖం చాటేస్తున్నారు

వివిధ ప్రభుత్వ శాఖల్లో కొంతమంది అధికారులు సర్వీసులో చేరిన నాటి నుంచి పదవీ విరమణ అయ్యే వరకు విశాఖలోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీని కోసం ఎలాంటి పైరవీలకైనా సిద్ధపడుతున్నారు. తమ పరిచయాలు వినియోగించుకుంటున్నారు. అధికారపార్టీ నేతల నుంచి ఫోన్లు, సిఫార్సు లేఖలతో తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మరికొందరు అధికారులు తమ కుర్చీ కదలకుండా ఉండేందుకు బేరసారాలకూ దిగుతున్నారు. దీంతో అలాంటి ఉద్యోగులను విశాఖనుంచి కదపడానికి ఉన్నతాధికారులు సాహసించలేకపోతున్నారు. ఇలాంటి వారి జోలికి వెళితే తమకే ఇబ్బందులు ఎదురవుతాయని మిన్నకుండిపోతున్నారు. అర్హులకు అన్యాయం చేస్తున్నారు. ఇలాంటి రికమండేషన్ ఉద్యోగులు ఎక్కువగా రెవెన్యూశాఖ, పంచాయతీ రాజ్ శాఖలో ఎంపీడీవోలు, ఇంజినీర్లు, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉద్యోగులున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా బదిలీలు జరుగుతున్నాయి. ఏజెన్సీలో ఎన్నో ఏళ్లనుంచి పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఉదాహరణకు ఏజెన్సీ నుంచి ముగ్గురు తహసీల్దార్లను విశాఖకు పంపితే, విశాఖ నుంచి ముగ్గురు తహసీల్దార్లను తిరిగి ఏజెన్సీకి పంపాల్సి ఉంటుంది. అక్కడ నుంచి విశాఖకు రావడానికి చాలా మంది ఆసక్తిగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ విశాఖ నుంచి ఏజెన్సీకి వెళ్లడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో బదిలీల వ్యవహారం ఉన్నతాధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటరుగా చేరండి

మహారాణిపేట: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసి మూడు నెలలు గడిచింది. ఇప్పుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతుంది. నిర్ణీత సమయంలో ఎన్నికలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటు నమోదు ప్రక్రియకు జిల్లా అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి ఈ నెల 30న నోటిఫికేషన్ జారీ చేస్తారు. నవంబర్ 6 వరకు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబర్ 23న ఓటర్ల నమోదుపై డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తారు. దీనిపై నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పాత ఓటర్ల జాబితాను పరిగణలోనికి తీసుకోరు. కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన వారితో పాటు గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా మరలా నమోదు కావాల్సి ఉంటుంది. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫారం 19 ద్వారా ఓటు హక్కును పొందాల్సి ఉంటుంది. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సెకండరీ పాఠశాల, ఆపై సంస్థల్లో పని చేస్తూ నవంబర్ ఒకటో తేది నాటికి గత ఆరేళ్లలో మూడేళ్ల సర్వీసు నిండిన వారు అర్హులు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోయినా అర్హత కలిగి ఉంటే ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావచ్చు. ఫారం–19తోపాటు ఫొటో, సర్వీస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు(ఆప్షనల్), ఓటర్ ఐడీ కార్డు/నివాస ధ్రువీకరణపత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేసి రసీదు పొందవచ్చు.

వందే భారత్ సందడి



తాటిచెట్లపాలెం: విశాఖకు మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే విశాఖపట్నం–సికింద్రాబాద్, భువనేశ్వర్– విశాఖపట్నం, సికింద్రాబాద్– విశాఖపట్నం మధ్య వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఇది విశాఖ నుంచి ప్రయాణించే నాలుగోది అవుతుంది. రాయ్‌పూర్–విజయనగరం మార్గంలో ఇది మొదటిది. ఈ రైలు ఈనెల 20 నుంచి రెగ్యులర్‌గా గురువారం మినహా వారానికి ఆరు రోజులపాటు రాకపోకలు సాగించనుంది. దుర్గ్–విశాఖపట్నం(20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 5.45 గంటలకు దుర్గ్‌లో బయల్దేరి మధ్యాహ్నం 1.55 గంటలకు వైజాగ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం–దుర్గ్(20830) వందేభారత్ రైలు మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి రాత్రి 10.50 గంటలకు దుర్గ్‌కు వెళ్తుందని తెలుస్తోంది. సోమవారం విశాఖలో జరిగిన రైలు ప్రారంభోత్సవం కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీ భరత్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె.రాజ్‌కుమార్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైలు ఎక్కి సందడి చేశారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మత్తు మాత్ర ఇచ్చి లైంగిక దాడి

- వరుసకు చెల్లిపై కన్ను
- పోలీసుల అదుపులో నిందితుడు

మల్కాపురం: చట్టాలు ఎన్ని వచ్చినా.. మహిళలపై లైంగిక దాడులు ఆగడం లేదు. తాను మనిషి నన్న విషయాన్ని కూడా మరిచిపోతున్న కామాంధులు.. మదమెక్కిన మృగంలా వ్యవహరిస్తూ మానవత్వానికే మాయని మచ్చ తెస్తున్నారు. కామంతో కళ్లు మూసుకుని.. వరుసకు చెల్లిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు ఓ మృగాడు. మల్కాపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాలు ఇలా..

శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన జోగి పాపారావు స్థానికంగా ఓ సెల్ షాపు నడుపుతున్నాడు. వరసకు బావమరిది అయిన వ్యక్తి ప్రేమ వివాహం చేసుకుని 2021 నుంచి పాపారావు ఇంటి సమీపంలోనే నివాసముంటున్నాడు. హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన సదరు వ్యక్తి పనుల నేపథ్యంలో సొంతూరు పలాస వెళ్లాడు. తన భార్యకు ఏ అవసరం వచ్చినా కాస్త సాయం చేయాలని పాపారావుకి చెప్పాడు. ఈ నెల 8వ తేదీన సదరు భార్యకు జ్వరం రావడంతో మందులు తీసుకురావాలని పాపారావును కోరింది. ఇదే అదునుగా పాపారావు జ్వరం మందులతో పాటు మత్తు టాబ్లెట్ కూడా తీసుకువెళ్లి బాధితురాలికి ఇచ్చాడు. ఈ మాత్ర వేసుకుంటే త్వరగా జ్వరం తగ్గుతుందని దగ్గరుండి మరీ వేయించాడు. దీంతో కొద్దిసేపటికే ఆమె మత్తులోకి జారుకుంది. దీంతో పాపారావు ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కోలుకున్న బాధితురాలు జరిగిన ఘటనను తల్లిదండ్రులకు వివరించి రోదించింది. తల్లిదండ్రుల సాయంతో ఆదివారం సాయంత్రం మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాపారావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధితురాలిని కేజీహెచ్‌కు వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు. సీఐ విద్యాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సా.. గుతున్న ప్రాజెక్టులు

- నత్తనడకన మల్టీలెవెల్ కార్ పార్కింగ్, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాలు
- 50 శాతం కూడా పూర్తవని టౌన్‌షిప్ లేఅవుట్లు
- గత ప్రభుత్వ సమయంలో ప్రాజెక్టులకు మంగళం?


మల్టీలెవెల్ కార్ పార్కింగ్

విశాఖ సిటీ: మెట్రోపాలిటన్ కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ ప్రాజెక్టులు మాత్రం నిర్ణీత సమయానికి ముందుకు సాగవు. ఉన్నతాధికారులు సమీక్షలు చేసిన ప్రతిసారి ప్రాజెక్టులు ప్రగతిలో ఉన్నాయంటారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళితే.. ఆరు నెలల్లో పూర్తవుతుందని చెప్పేస్తారు. కానీ ఏళ్లు గడిచిపోతుంటాయి. కమిషనర్లు మారిపోతుంటారు. కానీ ప్రాజెక్టులు మాత్రం పూర్తవవు. ఇదీ విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ప్రాజెక్టుల పరిస్థితి. గత నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ప్రాజెక్టులు, మాస్టర్‌ప్లాన్ రహదారులు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణ పనులు ఇప్పటికీ సా.. గుతూనే ఉన్నాయి. కొన్ని పర్యాటక ప్రాజెక్టులకు డీపీఆర్‌లు, టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ.. అతీగతి లేకుండా ఉన్నాయి.

రహదారులు, కన్వెన్షన్ సెంటర్ల పరిస్థితీ అంతే..

వీఎంఆర్‌డీఏ చేపట్టిన మాస్టర్‌ప్లాన్ రహదారుల పనులు కూడా నత్తనడక జరుగుతున్నాయి. సబ్బవరం నుంచి గుల్లేపల్లి వరకు తొలి దశలో 60 అడుగుల బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితమే ప్రణాళికలు చేశారు. రూ.9.7 కోట్లతో 3.75 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ రహదారి పనులు నత్తను తలపిస్తున్నాయి. అలాగే యలమంచిలి బస్టేషన్ నుంచి రైల్వే స్టేషన్ వరకు, అదే విధంగా బక్కన్నపాలెం, రేవల్లపాలెం, నగరంపాలెం మిగిలిన పనులు కూడా అదే పరిస్థితిలో ఉన్నాయి. ఇటీవలే మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ ఈ మాస్టర్‌ప్లాన్ రహదారి పనుల తీరును స్వయంగా పరిశీలించారు. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ పనులు మాత్రం ఆ దిశగా జరగడం లేదు. ఇక పెందుర్తి మండలం చీమలాపల్లిలో రూ.6.75 కోట్లతోను, ఎండాడ హైవేలో రూ.7.67 కోట్లతో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాన్ని 2022లో ప్రారంభించారు. ఇప్పటికి చీమలాపల్లిలో 80 శాతం పనులు పూర్తయింది. ఈ ఏడాది నవంబర్ నాటికి దీనిని అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు. అలాగే ఎండాడలో మాత్రం పనులు వేగంగా సాగడం లేదు. ఇప్పటికి స్లాబులు మాత్రమే పూర్తయ్యాయి. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్(ఆర్‌ఓబీ) పనులు చాలా కాలం సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. ప్రస్తుతం అడ్డంకులన్నీ తొలగిపోయినప్పటికీ.. ఇప్పటికీ పైలింగ్ పనుల దశలోనే ఉన్నాయి.

పర్యాటక ప్రాజెక్టులకు మంగళం?

పర్యాటకులను ఆకర్షించేలా గత ప్రభుత్వ హయాంలో కొన్ని ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇపుడు వాటికి అతీగతి లేకుండా పోయింది. ఆ ప్రణాళికలను బుట్టదాఖలు చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ పార్కు వద్ద రూ.7.8 కోట్లతో బీచ్ డెక్ నిర్మాణ బాధ్యతలను విజయ్ నిర్మాణ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. అయితే సీఆర్‌జెడ్ అనుమతులు వచ్చిన వెంటనే ప్రారంభించాలని అనుకున్నారు. కానీ ప్రభుత్వం మారిన తరువాత ఆ దిశగా ఇప్పటి వరకు ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు. అలాగే వైశాఖి జల ఉద్యానవనం 3.48 ఎకరాల్లో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టుకు ఏర్పాట్లు చేశారు. టెండర్లు పిలిచేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టును అటకెక్కించినట్లు తెలుస్తోంది. అదే విధంగా కైలాసగిరిపై నేచర్ కాటేజ్, రివాల్వింగ్ రెస్టారెంట్, బీచ్ వ్యూ కేఫ్ టెండర్ల దశలోనే నిలిచిపోయాయి. ఇక బీచ్ రోడ్డులో రూ.88 కోట్ల అంచనా వ్యయంతో నేచురల్ హిస్టరీ పార్క్, మ్యూజియం, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లకు డీపీఆర్ సైతం సిద్ధం చేసి కేంద్రానికి పంపించారు. ఇప్పటి వరకు దానిపై ఎటువంటి నిర్ణయం జరగలేదు. ఇంకా పీపీపీ పద్ధతిలో ఆసక్తి వ్యక్తీకరణ దశలో మరికొన్ని ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై ఇప్పటి వరకు అధికారులు దృష్టి పెట్టలేదు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పక్కనపెట్టేసే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మల్టీలెవెల్ కార్ పార్కింగ్ ఎప్పటికి పూర్తయ్యేనో..

సిరిపురం, బీచ్ రోడ్డులో పార్కింగ్ సమస్యను అధిగమించేందుకు సిరిపురం జంక్షన్‌లో ఉద్యోగ భవన్‌కు ఎదురుగా ఉన్న 1.72 ఎకరాల్లో భారీ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ అండ్ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.87.5 కోట్ల వ్యయంతో 11 అంతస్తులతో క్రూయిస్ నౌక నమూనాలో ఈ నిర్మాణాన్ని 2022లో ప్రారంభించారు. ఇందులో 5 అంతస్తులలో పార్కింగ్ సదుపాయంతో పాటు మిగిలిన ఫ్లోర్లలో ఆఫీస్‌లు, షాపింగ్‌లకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారు. ఒప్పందం ప్రకారం ఏడాదిన్నరలో ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఈ నిర్మాణాలు పూర్తి కాలేదు. ప్రాజెక్టు రూపకల్పన నుంచి ఇప్పటి వరకు నలుగురు కమిషనర్లు మారారు. గత మెట్రోపాలిటన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున కూడా అనేక సార్లు ఈ ప్రాజెక్టుపై సమీక్షలు జరిపారు. అప్పుడు ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. పూర్తి కాక పోగా.. ఆయన కూడా బదిలీ అయి వెళ్లిపోయారు. తాజాగా కొత్త కమిషనర్‌గా కె.ఎస్.విశ్వనాథన్ వచ్చారు. ఈయన కూడా ప్రాజెక్టు నిర్మాణ పనులను స్వయంగా సందర్శించారు. అప్పుడు కూడా ఇంజినీరింగ్ అధికారులు ఆరు నెలల సమాధానమే చెప్పుకొచ్చారు. ఇప్పటికి 75 నుంచి 80 శాతం పనులు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం ప్రాజెక్టు పూర్తికి ఇంకా సమయం తీసుకుంటారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

నత్తనడకన టౌన్‌షిప్ లేఅవుట్లు

మధ్యతరగతి ప్రజల కోసం వీఎంఆర్‌డీఏ **ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్** లేఅవుట్లకు మూడేళ్ల క్రితమే **నిర్ణయించింది.** ఇందుకోసం విశాఖ జిల్లాలో **పాలవలసలో** 76.96 ఎకరాల్లోను, అనకాపల్లి **జిల్లాలో అడ్డూరు**లో 20 ఎకరాలు, భోగాపురం, **చోడవల్లిలో** 51.89 ఎకరాలు, విజయనగరం జిల్లాలో రాఘుమండలో 22.5 ఎకరాలు, జియ్యన్నవలసలో 12.31 ఎకరాలు, గరివిడిలో 21.3 ఎకరాలలో లేఅవుట్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఈ పనులు పూర్తి కాలేదు. పాలవలస, అడ్డూరులలో ఇంకా కంకరతోనే రోడ్లు, డ్రయిన్ల పనులు జరుగుతుండగా, విజయనగరం జిల్లాలో మూడు లేఅవుట్లలో ప్రస్తుతం డ్రెయిన్లు మాత్రమే పూర్తి చేశారు. సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి. అలాగే అనకాపల్లి జిల్లాలో, భోగాపురం, చోడపల్లిలో ఇంకా జంగిల్ క్లియరెన్స్, స్థలాన్ని లెవెల్ చేయడంలోనే ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు వాహనాలు దగ్ధం


దుక్కవానిపాలెంలో వాహనంలో చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


వేములవలస ఫ్లై ఓవర్ కింద దగ్ధమైన పల్సర్ బైక్

తగరపువలస: ఆనందపురం మండలంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెండు వేర్వేరు సంఘటనలలో బొలేరా వాహనంతో పాటు పల్సర్ బైక్ దగ్ధమయ్యాయి. భీమిలి మండలం తాళ్లవలస అగ్నిమాపకకేంద్రం అధికారి జి.శ్రీనివాసరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నుంచి నవీన్ అనే వ్యక్తి పల్సర్ ద్విచక్రవాహనంపై విజయనగరం జిల్లా సాలూరు వెళ్తూ ఆనందపురం సమీపంలో పెట్రోల్ వేయించాడు. అనంతరం బయలుదేరిన కొద్ది సేపటికే వేములవలస ఫ్లై ఓవర్ కిందకు చేరేసరికి వాహనం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాలలోనే వాహనం మొత్తం దగ్ధమైంది. అదే విధంగా బోయిపాలెం పంచాయతీ దుక్కవానిపాలెంలో ఆనంద్‌కు చెందిన బొలేరా వాహనం కూడా దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రెండు ప్రమాదాల్లో రూ.4లక్షలు ఆస్తి నష్టం జరిగిందని నిర్ధారించారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం


ఎక్స్‌పోలో దుప్పట్లను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

అల్లిపురం: దసరా పండగ ఉత్సవాలు, వివాహాల సీజన్ కోసం అద్భుతమైన భారతీయత ఉట్టిపడే సంప్రదాయ వస్త్రాలతో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–ఎగ్జిబిషన్ కమ్ సేల్ సోమవారం నగరంలో గ్రీన్ పార్క్ హోటల్ ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పో సోమవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈఎక్స్‌పోలో దేశం నలుమూలల నుంచి తమమ విశిష్ట ఉత్పత్తులతో నేత కార్మికులు చేతుల్లో రూపుదిద్దుకున్న అందమైన చీరలు కొలువుదీరాయని వివరించారు. వేలాది రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, బ్లౌజులు, కుర్తాలపై 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయించనున్నట్టు తెలిపారు. ఎక్స్‌పో ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రవేశం ఉచితమని తెలిపారు.

ఏపీకి ఫిల్మ్ ఇండస్ట్రీని రప్పిస్తాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


రామ్మోహన్ నాయుడును సత్కరిస్తున్న ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతిని

మద్దిలపాలెం: ఫిల్మ్ ఇండస్ట్రీని తెలంగాణ నుంచి ఏపీకి రప్పించేందుకు కృషి చేస్తామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. సోమవారం విశాఖ వచ్చిన మంత్రిని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్.కంచర్ల అచ్యుతరావు, ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి ఫెడరేషన్ ప్రతినిధులు పలు సమస్యలను వివరించారు. ఫిల్మ్ ఇండస్ట్రీ అభివృద్ధి కోసం చేపట్టనున్న కార్యాచరణను వివరించారు. అంతేకాకుండా ఇండస్ట్రీ విశాఖకు తరలిరావడం వల్ల ఎన్నో వందల కుటుంబాలకు ప్రత్యేక్షంగా ఉద్యోగాలు, పరోక్షంగా ఉపాధి కలుతుందని చెప్పారు.దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ సినిమా పరిశ్రమ రాష్ట్రానికి రావడం ఎంతో అవసరమన్నారన్నారు. 24 క్రాఫ్ట్సకు సంబంధించిన సిబ్బంది, 64 కళల కళాకారులకు కూడా నిత్యం ఉపాధి లభించడానికి ఆస్కారం వుంటుందన్నారు. ఈ విషయాన్ని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రితో చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే జి.శంకర్ పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

ఎంవీపీకాలనీ: భార్యను హత్యచేసిన ఘటనలో భర్త డానియేల్‌ను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన డానియేల్, సీలేరుకు చెందిన సలోమిని 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. విశాఖలోని నక్కవానిపాలెం శివాలయం వీధిలో ఉంటున్నారు. డానియేల్ ఎండాడలోని ఓ చర్చిలో పనిచేస్తుండగా సలోమి నగరంలోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు(కవలలు) ఉన్నారు. భార్యపై డానియేల్‌కు అనుమానం ఉండటంతో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా క్షణికావేశంలో డానియేల్ ఆమెను కొట్టడంతో పాటు చున్నితో ఫ్యాన్‌కు ఉరివేసి హత్యచేశాడు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి రావడంతో డానియేల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అతని సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోర్టులో స్వచ్ఛత హీ సేవ ప్రారంభం

విశాఖ సిటీ: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం మెరుగుపడుతుందని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా విశాఖ పోర్టు అథారిటీ స్వచ్ఛత హీ సేవ (ఎస్‌హెచ్‌ఎస్) పక్షోత్సవాన్ని సోమవారం పోర్టు పరిపాలన కార్యాలయంలో ప్రారంభించింది. ఈ ఏడాది 'స్వభావ స్వచ్ఛత- సంస్కార స్వచ్ఛత' నినాదంతో చేపట్టిన కార్యక్రమం అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున స్వచ్ఛ భారత్ దివస్‌తో ముగియనుంది. ఈ సందర్భంగా పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులతో కలిసి డాక్టర్ ఎం.అంగముత్తు స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించారు. స్వచ్ఛత హీ సేవ 2024లో భాగంగా ఉద్యోగుల్లో అవగాహన కల్పించేందుకు నాటకాలు, స్కిట్స్ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్‌దుబే, సీవీఓ పి.ఎస్.ఎల్.స్వామి ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వివాహిత కిడ్నాప్ కేసులో రౌడీషీటర్ సహా ముగ్గురి అరెస్ట్

పెందుర్తి: వివాహితను కిడ్నాప్ చేసిన ఘటనలో ఓ రౌడీ షీటర్ సహా ముగ్గురు వ్యక్తులను పెందుర్తి పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన నాగులు మోహన్‌సాయి(రౌడీషీటర్)కి గతంలో పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ యువతితో పరిచయం ఉంది. ఆమెకు కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. రౌడీషీటర్ మోహన్ సాయితో పాటు నందవరపు కుమార్, అభి అనే వ్యక్తులు సోమవారం ఆమెను ఇంటి నుంచి బలవంతంగా ఆటోలో ఎక్కించి తీసుకువెళుతుండగా.. ఆమె భర్త 112 ద్వారా ఫిర్యాదు చేశాడు. తక్షణమే రంగంలోకి దిగిన పెందుర్తి పోలీసులు రౌడీషీటర్ మోహన్‌సాయితోపాటు కుమార్, అభిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. రౌడీషీటర్ మోహన్‌సాయిపై ఇప్పటికే ఆరు కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు.

అద్దె కారుతో పరారైన దంపతుల అరెస్ట్

అగనంపూడి: కారు అద్దెకు తీసుకొని వడ్డీ వ్యాపారికి తాకట్టు పెట్టి ఉడాయించిన దంపతులను దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూర్మన్నపాలెంకు చెందిన బుద్ధా వీర మణికంఠ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అదనపు ఆదాయం కోసం కారును నెలసరి వాయిదా పద్ధతిలో కొనుగోలు చేసి ఖాళీ సమయంలో అద్దెకు తిప్పుతున్నాడు. ఈ క్రమంలో ఈఎంఐలు చెల్లించడానికి ఇబ్బందులు పడుతుండడంతో కారును ఓఎల్‌ఎక్స్‌లో విక్రయానికి పెట్టాడు. ఇది చూసిన మల్కాపురానికి చెందిన దంపతులు ఎరుపల్లి రవీంద్ర, రూపాశ్రీలు వీరమణికంఠను కలిసి కారు అమ్మడం ఎందుకు తమకు అద్దెకు ఇస్తే నెలకు రూ.35వేలు చెల్లిస్తామని నమ్మబలికారు. దీంతో మణికంఠ వీరికి కారు అద్దెకు ఇచ్చాడు. మొదటి నెల అద్దె చెల్లించి నమ్మకం కల్పించారు. తరువాత నుంచి అద్దె చెల్లించక, ఫోన్లకు సరిగా సమాధానం చెప్పకపోవడంతో మణికంఠ దంపతులను నిలదీశాడు. ఇదిగోఅదిగో అంటూ మాయ మాటలు చెప్పారు. తీరా రవీంద్ర ఇంటికి తాళాలు వేసి ఉండడంతో ఆ కారు ఆచూకీ కోసం జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయగా అనకాపల్లి జిల్లా కాకరాపల్లికి చెందిన వడ్డీ వ్యాపారికి రెండు లక్షల రూపాయలకు కారును తాకట్టు పెట్టినట్టు తెలుసుకొన్నాడు. దువ్వాడ పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. మణికంఠ ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు రవీంద్ర, రూపాశ్రీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సహస్ర దీపాలంకరణ సేవ మండపానికి శంకుస్థాపన

- సింహగిరిపై కేశఖండనశాల భవనం ప్రారంభం
- ఉత్సవ మార్గదర్శి పుస్తకాన్ని ఆవిష్కరించిన అశోక్ గజపతి


సహస్ర దీపాలంకరణ సేవ మండపానికి శంకుస్థాపన చేస్తున్న అశోక్ గజపతిరాజు

సింహాచలం: సింహగిరిపై రాజగోపురం సమీపంలో దాత సహకారంతో నిర్మించనున్న సహస్రదీపాలంకరణ మండపం పనులకు సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శంకుస్థాపన చేశారు. 2014 డిసెంబర్‌లో దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ ప్రవేశపెట్టారు. ప్రతీ శనివారం సాయంత్రం 5.30గంటల నుంచి 6.30గంటల వరకు ఈసేవ జరిగేది. 2020లో కోవిడ్ కారణంగా ఆ సేవను నిలిపివేశారు. ఇటీవల మళ్లీ పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సహస్రదీపాలంకరణ సేవకు ప్రత్యేక మండపాన్ని నిర్మించేందుకు విశాఖకు చెందిన దాత నారాయణరెడ్డి ముందుకు వచ్చారు. ఆ పనులకు అశోక్‌గజపతిరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు,ఏఈవో ఆనంద్‌కుమార్, దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

కేశఖండనశాల నూతన భవనం ప్రారంభం

సింహగిరిపై కేశఖండనశాల నూతన భవనాన్ని అశోక్‌గజపతిరాజు సోమవారం ప్రారంభించారు. గంగధారకి వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఉన్న కేశఖండనశాల భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతుండటంతో పక్కనే ఇటీవల నిర్మించిన క్యూకాంప్లెక్స్ పై అంతస్తులోకి కేశఖండనశాలను రూ.8 లక్షలో ఆధునికీకరించారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సంవత్సరం కాలంలో జరిగే నిత్య, వార,పక్ష, మాస, విశేష ఉత్సవాలతో సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రత్యేకంగా రూపొందించిన నమూనా పుస్తకాన్ని అశోక్‌గజపతిరాజు ఆవిష్కరించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు


ప్రధాన కలశను శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు. చిత్రంలో ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పూర్ణాహుతి కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం కుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, రథబలి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ శిఖరాలకు పవిత్ర సమర్పణ చేశారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి దివ్యప్రబంధ పారాయణాలు, సింహాచలం క్షేత్ర మహత్యం, వేద మంత్రోశ్ఛరణలతో స్వామిని కీర్తించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉచిత ఇసుక కోసం ఆందోళన

- ఎన్‌ఏడీలో జిల్లా బిల్డింగ్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ధర్నా


ధర్నా చేస్తున్న సీఐటీయూ. భవన నిర్మాణ కార్మికులు

గోపాలపట్నం : ఇసుక ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా భవన నిర్మాణ కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ టన్ను ఇసుక ధర రూ.1000 నుంచి రూ.2000కు పెరగడం వల్ల నిర్మాణదారులు పనులు నిలిపి వేశారన్నారు. దీంతో కార్మికులు పని లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి నేతలు ఉచిత ఇసుక హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రెండింతలు పెంచేసిందని విమర్శించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. బస్తా సిమెంట్ రూ.370 అయితే ఇసుక బస్త రూ.350కి బయట మార్కెట్లో అమ్ముతున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు రెల్ల మల్లేసు, అప్పారావు, దాలయ్య పాల్గొన్నారు.

'లైట్' తీస్కోవద్దు



అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుకుంది. జాతీయ రహదారిపై విద్యుత్ దీపాల నిర్వహణను లైట్ తీసుకుంటున్నారు. ప్రమాదాల నివారణకు ఓ వైపు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తుంటే..మరోవైపు అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. గాజువాక నుంచి మురళీనగర్ జాతీయ రహదారిలో ఎయిర్‌పోర్టు వద్ద విద్యుత్ స్తంభాలకు పాదులు, చెట్లు కమ్మడంతో విద్యుత్ దీపాలు కనిపించడం లేదు. దీంతో అంధకారం అలుముకుంది. విద్యుత్ సిబ్బంది, అధికారులు చొరవ తీసుకుని సరిచేయకపోతే భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







